# బాధ్యత

అంకితం

శ్రీమతి

రాధకు

చంద్రశ్రీ

సుందరం చివరకెలా అయితేనేం మ్యూజికల్ డైరెక్టరుగా కలకటా వెళ్లటం స్థిరపరచుకొన్నాడు...కాని ఓ చిన్న సందేహం ...మణిని కూడా తీసికెళ్లటమా?... లేక ఒంటరిగా వెళ్లటమా?...మణిని కూడా తీసికెడితే- తన స్వేచ్ఛకు భంగం కలుగుతుం దనుకున్నాడు. హాయిగా హుగ్లీనది వొడ్డున ఆవంగ దేశ స్త్రీల విలాసాలను కనులార కాంచకుండా...వీలయితే...ఆ విలాసాలలో తాను కూడా భాగస్వామి కాకుండా...ఎందుకు ఈ మణి?... మణితో అనుభవించే విలాసాలకు టైం దాటిపోయింది. నిన్నటి మొన్నటి దాకా.

"త్వమసి మమభూషణం
త్వమసి మమజీవనం
త్వమసి మేభవ జలధిరత్నం..."

అంటూ—ఆమె తప్ప ఈ అనంత సృష్టిలో తాను కోరతగిన యువతి లేనే లేదనుకున్నాడు. కాని బాబు పుట్టేసరికి—రసికత్వానికి ఎందుకూ పనికిరాని జమీందారి బిడ్డ అయింది మణీ...అయితే ఇందుకు మణి ఏం చేస్తుంది. గర్భ ఘాతినుల లాగా సంతానం అవసరం లేదని భ్రూణ హత్య చేయలేక పోయింది. పాపం!...చాలా అపరాధం చేసింది...

ఈ ఆలోచనలన్నీ పాపం; మణి గ్రహించదు...తాను కూడా కలకటా ఎప్పుడు చూస్తానా? అని ఆదుర్దాతో ఉంది...చివరకు ఓ రోజున సుందరం చెప్పేశాడు తాను ఒక్కడనే కలకటా వెడతానని. ఆ మాటకు మణి చిన్నపిల్లలాగా నేకూడా వస్తానని మారాం చేయడం మొదలెట్టింది. లాభం లేకపోయింది. చిన్నపిల్లలు మారాం చేస్తే- పెద్దవాళ్లకు కోపం వస్తే ఏం చేస్తారు?... రెండు తంతారు. ఆలాంటి స్థితిగా విసుక్కోటం ప్రారంభించాడు సుందరం...ఎలాగైనా యుక్తులతోనైనా సుందరాన్ని ఒప్పించాలనుకుంది.

"మీరొక్క నిమిషం లేకపోతే నేను మిమ్మల్ని విడిచిపెట్టి ఉండగలనా?...నామాట అలా వుంచండి. బాబు అసలు ఒక్క క్షణం ఉండగలడా?...బెంగ పెట్టుకోడూ?...ఎలాగయినా నే రాక తప్పదు" అంది మణి సగం విలాసంతో సగం సాంసారిక పద్ధతులతో...

"మణీ!...అవసరం అయినప్పుడూ కానప్పుడూ ఉండలేనంటే ఎలా చెప్పు. నాలుగు రోజులు బెంగెట్టుకున్నా బాబు ఆ తర్వాత అసలే మరిచిపోతాడు. ఈ మూణ్ణెల్ల భాగ్యానికి ఈ సంసారమంతా అక్కడికి తీసికెళ్లటం చెప్పు..." అన్నాడు సుందరం- విడిచిపెట్టి ఉండలేనన్న మణిని ఓదారుస్తున్నట్లుగా...

"మూణ్ణెల్ల భాగ్యమంటారు. మనవాళ్ళు మూణ్ణెల్లలో ఫిలిం తీస్తామంటే కనీసం మూడేళ్లయినా పడుతుంది. మీకు అక్కడ ఆరోగ్యం సరిపడినా సరిపడక పోయినా- మరి నా అనేవాళ్ళు లేకపోతే ఎలా చెప్పండి. అక్కడ మీరు ఒంటరిగా- ఇక్కడ నేను వొంటరి

వుండటం—చూసేవాళ్లకయినా బావుండద్దూ?...నన్ను మీ రేం మోసుకెళ్ళాలా? ... ఇప్పుడు మీతో వొచ్చేవాళ్ళు ఎంతమంది సంసారాలతో కూడా బయలు దేర లేదూ?...నన్ను తీసికెళ్ళటం ఉభయతా మంచిదే కాని- మించి పోయేదేమీ లేదు... నా మాట వినరూ?..." అంది మణి శ్రేయోభిలాషి మాట్లాడే మాటల్లాగా...

"మణీ! నువ్వు ఎంత చెప్పినా గ్రహించుకోలే వెందుచేత?...నిన్ను తీసికెళ్లటం నాకు కష్టమని కాదు... కొత్త దేశం సంసారమంతా ఒక్కసారి లేవతీసుకెళ్లామంటే; ఇందులో ఎవరికి కొత్త నీళ్ళు సరిపడక జలుబు చేసినా ఇంటికి రావాల్సి వొస్తుంది. వీళ్ళంతా దూరాలోచన లేనివాళ్లు కనుక భార్యల్ని కూడా భుజాన వేసుకుని బయల్దేరారు. నాకు నీళ్లు సరిపడ్డా సరిపడక పోయినా తప్పనిసరి గనుక ఎలాగో ఆలా తంటాలు పడతా...—నా మాటవిని ఎలాగయినా ఈ దఫాకు ప్రయాణం మాట తలపెట్టకు, నీకయినా ఇంట్లో కొత్త ఆసరాకి-రామారావువొచ్చి ఇక్కడే వుంటాడు. ఏపని కావాల్సినా- అతను చాలా మంచివాడు చేస్తాడు. నేను వారం వారం కులాసాగావున్నట్లు లెటర్సు రాస్తూవుంటా ...అంటూ ఏలాగైనా ప్రయాణం మాన్పించాలని ఎత్తులు వేస్తున్నాడు సుందరం...

సుందరం ఉద్దేశ్యమంతా గ్రహించింది మణి ..ఇహ ఇహ నెలగూ తీసికెళ్లడనుకుంది. ఇంకో స్రుతి హెచ్చించింది...

ఇంతకీ తీసికెళ్ళటం ఇష్టంలేక ఇన్నిపన్నాగాలు పన్నుతున్నారు. నాకు తెగయదూ మీ వుద్దేశ్యం అంది బుంగ మూతితో...వచ్చీరాని అశ్రుకణాలతో...

"మణీ! ఎన్నిచెప్పినా నీమాట నీకేనా?" అన్నాడు- తన మాట వినలేదనే- అహం భావంతో-కించి త్కోపంతో సుందరం...

"సరేలెండి... మీ యిష్టంమీది ...అంది కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ ... తనమాట సాగలేదనే ఉక్రోషంతో...

ఇంతమాత్రానికే కోపమూ ఏడ్పూ అయితే ఎలాచెప్పు నీకంత కష్టంగా వుంటే-పోనీ నే వెళ్ళిం తర్వాత అక్కడ పరిస్థితినిబట్టి-పదిహేను రోజుల్లోవొచ్చి తీసికెడతా-నని మణిని ఒప్పించాడు. ఆమాత్రం అనుకూలంగానైనా మాట్లాడకపోతే ఎలా?...ఈ మ్యూజికల్ డైరక్టరు పదవి ఉన్నన్నాళ్లూ మణి అవసరం లేకపోయినా-కలకటా విడిచి మళ్లీ మెడ్రాసు వొచ్చిం తర్వాతనైనా వొస్తుందిగా!...

* * *

సుందరం వెళ్లబోయేముందు రామారావుని పిలచి తాను ఇలా ఇలా వెడుతున్నానని-అతన్ని తన ఇంట్లోనేవుండి-కావలసిన వ్యవహారాలన్నీ సర్దుబాటుచేస్తూ వుండవలసిందనీ చెప్పాడు...

స్టేషన్‌వరకూ—మణీ రామారావూ ఇద్దరూ వెళ్లారు. ఇహ సుందరం వెళ్లిపోతూంటే—మళ్ళీ మణికివొచ్చి తీసికెళ్లడేమోనని అనుమానం బాధించింది. వెంటనే-కళ్ళనీళ్లు-ఆడవాళ్ళకేముందీ?...చేతనయినది-వాడి అయినది ఆ ఆయుధం ...అంతమాత్రం ఆయుధమైనా లేకపోతే-అసలు మగవాళ్ళు-ఆడవాళ్ళ మాట రవంతైనా వింటామా?... సామానంతా మెయిల్లో వేశారు. బాబును ఒక్కసారి తీసికొని ముద్దు పెట్టుకుని-; బాబు జాగ్రత్త...నేను మళ్లీ వీలుగా వుంటే పదిహేను రోజుల్లో వొస్తాగా! ..రామారావు! గుడ్‌బై అనిచెప్పి బాబును మణికి అందిచ్చాడు సుందరం...మణి-కన్నీటి చుక్కలు—ఆ సమయంలో సుందరం చేతిమీద ఒకటిరెండు పడ్డాయి. ఇన్నివిధాల చెపుతూంటే-నామాట నమ్మదు ఎందువల్ల?... అనే కోపంతో సుందరం కొంచెం తీక్ష్ణంగా చూచాడు. మణి తల వొంచుకుంది...సుందరం రైల్లో కూర్చున్నాడు. మెయిల్ ప్లాటుఫారం దాటింది. మణి కన్నీళ్లు

తుడుచుకుంటూ వెనక్కి తిరిగింది. రామారావుతోకూడా ఇంటి కొచ్చేసింది-వీలుగా వుంటే వస్తానన్న-సుందరం మాటకు- తీసికెళ్ళడని అర్థం నిశ్చయించుకుంది. ఎలాగయినా రెండుమూడు రోజులవరకు మణి అదోలావుంది.

* * *

రామారావుకూ సుందరానికీ- అసలు మొదట్లో ఏమీ సంబంధం లేదు. బాంధవ్యంలేదు. ఇద్దరూ క్లాస్ మేట్సూకాదు. ఓ నాడు గోక్లేహాల్లో సుందరం వీణ కచ్చేరీ చేశాడు- ఆ నాడు ఇతనికికూడా వీణసాధన చెయ్యాలని ఉద్దేశ్యం కలిగింది. అదివరకు అతను బాగా సంగీతం నేర్చుకున్నవాడు. అయితే కేవలంగాత్రం ఇదివరకు; ఇప్పుడు వీణసాధన; అందుకొరకై సుందరం దగ్గరకు వొచ్చాడు. తనంత పండితుడు తనదగ్గిర వీణసాధన చెయ్యటానికి వొచ్చాడంటే తనకూ గౌరవమేగా!...ఇద్దరూ ఇప్పుడు స్నేహప్రాయులయ్యారు కాని గురుశిష్య భావంతో సంచరించటంలా. రామారావు రోజూ వున్న 'ట్యూషన్స్' నాలుగు చెప్పుకోవటం-తర్వాత హొటాల్లో భోజనం చెయ్యటం సుందరం ఇంట్లోనే వీణసాధన చేస్తూ వుండటం. రాత్రి ఏ పదకొండింటికో-రూమ్‌కు వెళ్ళటం...సుందరం వెళ్లింతర్వాత పూర్తిగా బిచాణా సుందరం ఇంట్లోనే పెట్టేశాడు.

* * *

కల్‌కటా వెళ్ళింతర్వాత పదిహేను రోజుల్లో వస్తానన్న సుందరం రాలేదు సరిగదా ఇరవైరోజులవరకు ఉత్తరంకూడా రాయలా...తర్వాత ఎలా జ్ఞాపకం వొచ్చిందో; ఓకార్డుముక్కమీద--ప్రస్తుతం ఇచ్చట ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా లేవనీ; రావటానికి తీరుబడిగాలేదనీ-గీకిపారేశాడు. ఆ వుత్తరం చూసేసరికి-మణికి అరికాలిమంట నెత్తికెక్కింది. ఉడుకుమోతు తనంవల్ల కొంతసేపు బాధపడింది. "ఈ మొగవాళ్లకు-అందులో మరీ కొంతమందికి గుమ్మందాటితే ఇహ ఇల్లువాకిలీ గుర్తు వుండనేవుండదు. ఇంటిదగ్గర వాళ్ళు ఏమయిపోతే వారికేం? ...ఆయన సరదాగా హుగ్లీనదివొడ్డున సవిలాసంగా షైర్లుకొడుతూ వుండాలి. నేను వొక్కర్తెనూ ఇంట్లో...ఇలా పడివుండాలి... పాపం! వారి ఉద్దేశ్యం ఆడదంటే; ఇంట్లో వంట చెయ్యటానికి మాత్రమే అధికారం కలదని... ఇంకా చేసుకున్న పెళ్లామయితే... దాసీదాని కంటె అధమం...ఆవంగదేశస్త్రీల ముందర నేను పనికిరాలేదు కాబోలు!...కానీ!......తాము హాయిగా అక్కడ ఎలా కాలం గడుపుతున్నారో-మాకు మాత్రం...ఆత్మలేదూ?...మాకు మనస్సు లేదూ?...మేము నిర్జీవ ప్రతిమలమా?...' ఇంతలో రామారావు వొచ్చి-ఇవాళైనా ఏమయినా లెటర్ వొచ్చిందా?...అసలు ఈ సెంట్రల్ స్టేషన్ ప్లాటుఫారం దాటేసరికి మరిచిపోయారు ఈ సంసారం గొడవంతా...అన్నాడు మామూలుగా...

'ఆఁవొచ్చింది. రావటానికి వీల్లేదట...కడుపు నిండింది. ఉత్తరం రాసేసరికి--ఈ రెండుమాటలు గీకి పారెయ్యకపోతే మాత్రం ఏం?...' అంది ఎకసక్కెంగా...

"పోనీ-ఇంతమాత్రమైనా రాసినందుకు...ఈమాత్రమైనా జ్ఞాపకమున్నందుకు సంతోషించాలి"___ అన్నాడు రామారావు--మిత్రుడి లేఖకు అభినందిస్తూ........

"అలాగా! పాపం: చాలా శ్రమపడ్డారు మీ స్నేహితులు...అంది మణి అదో రకంగా చూస్తూ రామారావు వైపు..."ఆఁహాఁ." అన్నాడు రామారావు మణి అభిప్రాయమంతా గ్రహించినట్లు"

* * *

మణికి మనస్సులో ఇటీవల చాలా మార్పు ఏర్పడింది. మనసులో తీరనిబాధ...తెలియని ఆ వేదన...తన మనస్సు ఎవరినో వాంఛిస్తోంది. ఎందుకు వాంఛిస్తోందో?...ఏమో!...ఎవరూ చెప్ప

లేరు. మణికూడా చెప్పలేదు... ఎవరి మనసైనా వాళ్లకి తెలియకుండానే కావలసిన పురుషవ్యక్తిని కాని స్త్రీ వ్యక్తిని కోరుకుంటూ వుంటుంది. తమ వాంఛితం నెరవేరే వరకు మనస్సుకు శాంతివుండదు. అలాగే మణి మనస్సు రామారావును వాంఛించింది. ఇంతమాత్రం చేత—"స్త్రీణాంచ చిత్తం పురుషస్య భాగ్యం— దేవో నజానాతి కుతో మనుష్యః" అనీ— స్త్రీల మనస్సు— తామరాకు మీది నీటి బొట్టుమాదిరిగా చంచలమనీ— అనుకోటం చాలా పొరబాటు...నిజంమాట్లాడితే స్త్రీల మనస్సుకంటె, పురుషుల మనస్సే— చంచలం...స్త్రీని ఆనందింప చెయ్యాల్సిన మార్గాలు తెలియక— వాళ్లని అన్ని విషయాల్లో కూడా— నరక కూపంలోవుంచి బాధిస్తూ— వాళ్లసుఖంకోసం ప్రాకులాడే సరికి వ్యభిచారం చేసిందని హీనంగా చూస్తారు. ఆ వ్యభిచారమే పురుషుడు చెయ్యగానే ఘరానాతనంగా భావిస్తారు...ఈ ప్రపంచం ధోరణి ఇలా వుందేమిటి?... ఎంతసేపటికీ— స్త్రీ— తనలోవున్న— స్వాతంత్ర్యాన్ని— ఉపజ్ఞనీ—మానవత్వాన్ని— అది ఇదేమిటి— సర్వశక్తులు కోల్పోయి— శిలావిగ్రహంలా బ్రతకాలంటారు— ఏమిటీ అన్యాయం?...తాముస్వేచ్ఛ సుఖం— ఏ స్త్రీవల్లనైనా అనుభవించవచ్చు తాము భార్యలను అలా ఆనందింప చెయ్యలేరు. అంత మాత్రం సహనశక్తి మగవాడిలో లేదు.

... ... ...

తన అభిప్రాయాన్ని రామారావుకు తెలియపరచాలనుకుంది, మణి, కాని అంత త్వరలో బయటపడదుగా— ఆడదాని మనస్సు... మగవాడయితే "నేను నిన్ను ప్రేమిస్తున్నానని, స్పష్టంగా— బహిరంగంగా— చెప్పి తేలిక అయిపోతాడు. మణి అల్లాకాదు. తన అభిప్రాయాన్ని చేష్టల్లో— మాటల్లో దృష్టుల్లో— మెల్లమెల్లగా వెల్లడి చేస్తోంది...ఇవతలవాడు అభాంద్రా అయి, అయినావాడే కావాలని కోరే యువతి అయితే; వరూధిని లాగా తనంతట తానే కౌగిలించుకుంటుంది... రామారావు గుమ్మం కదలటంకూడా మణికి ఏ మాత్రమూ ఇష్టంలేదు...అతను కాస్సేపు కనబడకపోతే— అంతా శూన్యంగానూ— వెలితిగానూ కనుపిస్తోంది.

రామారావు గంభీరులలో గంభీరుడు. మణి అభిప్రాయం సన్నగా గ్రహించికూడా— ఏమీ తెలియని వాడిలా సంచరించటం ప్రారంభించాడు. ఆమె మనస్సును ఇంకా బాగా పరీక్షించాలని...ఆమె ఎలాగయినా ఇతన్ని గుమ్మం కదలకుండా బంధించాలని చూసింది...

ప్రక్క పోర్షన్స్‌లో అద్దెలకున్న వాళ్ళు నలుగురయిదుగురు కాపరాలవాళ్ళు శెలవులకు ఇళ్ళకు పోయారు...

"రాముం: ఇదివరకులాగా నువ్వు ఉత్సవవిగ్రహంలా ఊరంతా తిరుగుతూ వుంటే నేనొక్కదాన్ని వుండలేను. భయంకాదూ ఇంత మేడలో ఒక్కదాన్ని వుండటం. నీ తిరుగుడు ఇహ కట్టిపెట్టాలి" అంది అదోహ రకమైన అధికార సూచనతో...

ఏం చెప్పాలో తోచలా రామారావుకు. ఉన్న పాతాలు చెడగొట్టుకుంటే, గడిచే ఉపాయం ఏముందీ? అట్టే ఆలోచించాడు. "మానే స్తే ఇక్కడ ఉపాధి జరగటం కష్టం" అనిమాత్రం చెప్పాడు జడుస్తూ జడుస్తూ...

"ఎలాగైనా నా బాధ్యత నీమీద వుంచి వెళ్లాడు సుందరం. కనుక నేచెప్పిన ప్రకారం నడచుకోవాల్సిన బాధ్యత నీది. నీకు ఉపాధి జరగదనే భయం నీకు అఖర్లా. ఇక్కడే భోజనం చేస్తూవుండొచ్చు. అవసరం వొచ్చినపుడు. "పాకెట్ మనీకికూడా అభ్యంతరంలేదు. ఏ మంటావ్"? అంది మణి.

"నిజమే...మూణ్ణాల్ల భాగ్యానికి ఉన్న ట్యూషన్స అన్నీ వొదులుకుంటే— తర్వాత ఎలా?..." అన్నాడు— దీర్ఘ తర్కిలా...

ఇది ఘట్టిచిక్కే... "నువ్వు ఎప్పుడైనా... ఇంతమాత్రం 'మనీ' కోసం జడువవద్దు... ఆ బాధ్యత అంతా నాది నీకెందుకు?" అంది.

అయితే ఇలా ఎందుకంటోంది మణి?... అన్న ప్రశ్న బయల్దేరింది. మనస్సులో రామారావుకి... కేవలం భయంవల్లనే ఇలా అంటోంది మణి? అని ఎంత అభాండ్రా ఆయినా అనుకుంటాడూ?... అందులో ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే... అసాధ్యుడు అసలు రామారావంటే. ఏమయితే యేం? చివరకు మణీ గెల్చింది... రామారావు వోడిపోయి ట్యూషన్స్ మానేశాడు...

* * *

ఎన్ని భావాలు వెల్లడి చేసినా ప్రవరాఖ్యుని తాతలా ఫూరుకుంటున్నాడు రామారావు... మనస్సులో వుంది అభిప్రాయం... "వనిత నంతతా వలచివచ్చిన చుల్కన కాదె యేరికిన్" అనే ఉద్దేశ్యంతో ఫూరుకోలా... ఎంత స్నేహ భావంలో వున్నా- గురువేగా నిజంగా ఆలోచిస్తే సుందరం రామారావుకి... గురుభార్య... ఆ పేరెత్తితేనే పంచ మహా పాతకాలు చుట్టుకుంటాయి అని చెప్పారు చిన్నతనంలోదినే... పోనీ ఉదాహరణంగా చంద్రుణ్ణి తీసుకుని- ఆ మాటలు తోసేసి అంగీకరిద్దామన్నా... స్నేహితుడి భార్య .. ఆధునికులు... అందులో కొత్త కూస్తా చదువుకున్నవారు— స్నేహితుడి భార్య విషయంలో తల్లిలా సంచరిస్తారు... ఏమీ పాలుపోవటంలా... ధైర్యం వహించుదామంటే పిరికి దెయ్యం వెంటాడిస్తోంది...

... ... ...

ఆనాడు అదోహ రకంగా అలంకరించుకుంది మణి... రామారావుకు దిగులు వుంది... ఆమె ఎంతో ఉత్సాహంగా- మనస్సులో వున్న ఇచ్ఛ అంతా తీర్చుకుందామని... విరహ వేదనతో... మన్మధ బాధతో వేగలేక- స్వయందూతియై- చక్కగా అలంకరించుకుని దగ్గరకు వొస్తూంటే; ఇతను మనస్సులో కుల్లి కుల్లి ఏడవటం ప్రారంభించాడు.. అప్పటికీ తన సంగతేమిటో- తాను చూచుకుని అక్కడనుంచీ బయట పడదామనే దృష్టి... ఎంత అమాయుడు!...

ఎదురుగా కూర్చుంటే; ఏం చేస్తుందో మణి... ఈ పాతకం అనే బ్రహ్మక్షసి- ఎక్కడ మీద పడి- ఛంపేస్తుందో అన్న భయంతో... వీణైనా కాస్సేపు సాధన చేసుకుందామని మామూలుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు....

మామూలు ప్రదేశంలో లేదు వీణ—ఏమయిందీ? ఎవర్ని అడగాలీ?... ఎవరున్నారు ఇంట్లో... మణిని అడిగాడు... ఇంతకు మునుపు ...ఆ గదినిండా బూజువుంది అని ఆబూజు పడితే పాడైపోతుంది అని ఈ గదిలోపెట్టా... వెళ్ళి తెచ్చుకో ...అంది చిరునవ్వుతూ. తెచ్చుకో మనేసరికి ఉలిక్కిపడ్డాడు... గదిలోకి వెళ్ళటానికి- సెంట్రల్ జయిలులోకి- వెళ్లటానికి భయపడ్డట్టు భయపడ్డాడు... తీరా లోపలికి వెళ్లేసరికి మరోభయం...

అది సుందరం పడకగది... గది నిండా- పాశ్చాత్యయువతుల నగ్న చిత్రాలు నిల్వుటద్దాలు వున్నాయి. ఒకవైపున మంచానికి దగ్గిరగా సోఫావొకటి వుంది... దాని కెదురుగా... టేబిల్... టీపాయ్-ఫోను, రెండుమూడు కుర్చీలూ వున్నాయి. మంచంమీద తెల్లటిపరుపు... తెల్లటి దోమ తెరదిగవేసివుంది. ఆ మంచానికీ... గోడకీ మధ్య ప్రదేశంలో ఒక మూలగోడను ఆనించివుంది వీణ... మంచమీద కూర్చుని అందుకుంటేనే కాని అందదువీణ... మనసులో ముట్టుకోనా మంచం అని సందేహంతో వోణికి పోతున్నాడు... ఇలాంటి అనుభవాలన్నీ కొత్త రామారావుకి...

"ఏం?... మంచంకూడా ముట్టుకోనంతటి బ్రహ్మచర్య దీక్ష అవలంబిస్తున్నావా?..." అంది- పొంగుతూ వున్న భావోద్రేకాన్ని-- కొంచెంగా అణచివేస్తూ ఆ మాట వినేసరికి-

రామారావుకు గుండె దడదడ కొట్టుకోవటం ప్రారంభించింది.

జడుస్తూ జడుస్తూ—మంచం మీద కూర్చుని వీణ అందుకో బోతున్నాడు...ప్రక్కనే వొచ్చి కూర్చుంది మణి...ఆడదాన్ని చూస్తే నిజంగా ఇంతభయమా?...లేక నటనా?...ప్రవరాఖ్యుడు ఏమవుతాడూ? నీకు?...అంది...బుజం మీద హుషారుగా చెయ్యి వేస్తూ... ఆ స్పర్శకి అతని శరీరంలో రక్తం వుబికింది కొంచెం. అయినా నోట మాట రావటంలా...“ఇంత భయపడేవాడవి-రేపు పెళ్లాంతో ఎలా కాపరం చేస్తావు?...గదిలోకూడా ఇలాగే-...అంటూ అతని ముఖం దగ్గిరసా లాక్కుంది...ఆమె బాహువల్లరిలో నలిగిపోతున్నాడు. నరాలన్నీ బిగిసిపోయాయి అదివరకున్న నిగ్రహశక్తి అంతరించిపోయింది .. ఎంతసేపు మగవాడిమనస్సు?...పట్టుదల...?...కాని ఆస్పర్శతోనే ప్రవరుడులాంటి వాడల్లా మాయాప్రవరాఖ్యుడయ్యాడు...తనూకాస్త ఉచితంగానే ప్రవర్తించాడు...

* * *

“నేనిలా ప్రవర్తించటం తప్పేమో?...అని ప్రశ్నించాడు అంతరాత్మని...

“స్త్రీ తనంతట స్వయంగా వొచ్చి-కోరినప్పుడు-అంత దోషం లేదేమో!...” అనుకున్నాడు... అయినా తొందరపడటం ఎందుకు? ...మళ్లీ ఇలాంటి తప్పాయివోస్తే, ఇంకోసారి చీవాట్లువేద్దా మనుకున్నాడు...

* * *

ఆనాడు గోఖలే హాల్లో రామారావు పాటకచ్చేరీ...రోజూ గుమ్మం కదలటం తప్పినా ఆనాడు తప్పలా ...మణితో చెప్పాడు-ఇలా ఇలా సంగతనీ అభిప్రాయం ఏమిటనీ మణికికూడా అతని కచ్చేరి వినాలని చాలా కుతూహలంగా వుంది...సరే నని వొప్పుకుంది...అయిదు గంటలకే కచేరీ...నాలుగింటికే బయల్దేరి వెళ్ళిపోయాడు...మణి రాజపుటానాసిల్కు చీర కట్టుకుని, తలనిండా మల్లెపూలు అర్ధచంద్రాకృతిగా అలంకరించుకుని--కాళ్లకు బర్మాశాండల్సు కళ్లకు స్పెటికల్సు... తను కూడా వెళ్లింది హాలుకి... హాలంతా కిటకిటలాడి పోతూంది... కచేరీ చాలా బావుంది అంటే, చాలా బావుంది అని అయ్యర్లు కూడా ఆమోదం చూపించారు... మణికి-అతని కచేరీమాట ఎలావున్నా సభలో అంతా అతన్ని గురించి అలా పొగడుతోంటే మహాసంతోషంగా వుంది...చివరకు అష్టపదివొకటి పాడాడు... జావళీకూడా ఒకటి పాడాడు...జావళీ వింటూంటే- మణికి వొళ్ళు పులకరించింది...ఇంకా ఇంకా వినాలనిపించింది... డ్రామాకాదుగా ఎవరైనా వన్సుమోర్, కొట్టడానికి... పోనీ ఇంటి దగ్గర మరోసారి పాడించుకోవచ్చు ననుకుంది...అలా పాడతాడా?...ఆఁ,నే పాడమంటే కూడా పాడడూ?...

... ... ...

మణి వొచ్చినవో అరగంటకు ఇంటికి చేరుకున్నాడు...అభినందన వాక్యాలకు కృతజ్ఞత చూపేసరికి ఆలస్యమయింది...ఈలోగా మణికి పిచ్చెత్తినట్లుగావుంది...అబ్బ! ఇంత చక్కగా పాడతాడనుకోలేదుస్మీ!... ఏమిటీ ఆ జావళీ?...“అపుడు మనసు నిలచునటే...” ట, నిలవదు కాబోలు!...అయినా అడగాలి. ఇంటికొచ్చిం తర్వాత మళ్లా ఆ జావళీ మరచి పోతానేమో యని- అతను వొచ్చేవరకు- ఆముక్క జపిస్తూ కూర్చుంది...

... ... ...

రామం! నువ్వు ఇంత ఘనంగా పాడతావని అనుకోలేదు...అయ్యర్లనందరినీ ఆడించేశావు...ఎంత చక్కని కీర్తనలు పాడావోయ్... కీర్తనలుకావు అవి అమృతగుళికలు- ఏదీ ఇందాక పాడిన జావళీ మరోసారి పాడవూ?... వినాలనివుంది... అంది...అతను కోటువిప్పి-ఈజీచైర్ లో కూర్చుంటూంటే...

పాడితే ఏం తప్పో?... సంసారుల ఇళ్లల్లో జావళీలా?... పాడకపోతే ఏం కోపంవొస్తుందో!... కాని పాడినంత మాత్రాన తప్పేముందీ?... ఇంత బ్రతిమాలుతోంది కనుక పోనీ పాడేసింతర్వాత చెబుదా మనుకున్నాడు తాను చెప్పతలచుకున్న నీతి పాఠమంతా... ముందుగానే జావళీ పాడమన్నది కదా అని నీతిపాఠం వొప్పగించటం ఎందుకూ? సందర్భం లేకుండా... ప్రారంభించాడు పాడటానికి... ఆఁహాఁ! అలా కాదు... వీణమీద పాడేవంటే ఇంకా చాలా బావుంటుంది... అన్నది... తప్పని సరిగా వీణ తీసుకున్నాడు... మణి ప్రక్కనే కొంచెం ఓసరిల్లికూర్చుంది.

అప్పుడు మనసు నిలచునటే.

అతివరో యి-దే-టి-మాటల అల

సొగసు యౌవన మూకల-

చక్కని యువతులు.

పురుషుల పక్కచేరి- సరసముగ-

మాట్లాడుచునుండగ- "అ॥ ఆ చరణం పాడేసరికి మణికి శరీరం తెలియలా... ఇంకా దగ్గిరిగా జరిగింది. చెయ్యి నడుముకు తాకించింది. పాడుతున్నవాడు 'సడెన్' గా ఆపేశాడు. చెయ్యి భుజంమీదికి పోనిచ్చింది. ముఖం దగ్గరసా లాక్కుని- రామం!... నిలవదు కాబోలు మనస్సు ఇన్నాళ్లనుంచీ- మరి నీ మనస్సు నిలిచిందే?... నేను సరసం తెలిసినదాన్ని కాదు కాబోలు;... అంటూ ముఖం చుంబించింది... చెబుదా మనుకున్న నీతిపాఠం అంతా మరచిపోయాడు. అప్రయత్నంగా ఆమె శరీరాన్ని... తనంతట తానే కౌగిలిలోకి తీసుకుని....... ఆమె అధరమధువుని... తనివి తీరా.

... ... ...

అసలిన్నాళ్లనుంచీ తాను ఇలా ఉపేక్ష చేసి నందుకు తన తెలివి తక్కువ తనాన్ని తానే నిందించుకున్నాడు... ఇప్పటికయినా తొ సెయ్యకుండా ప్రవరుడిలా తనకే మాత్రం జ్ఞానోదయ మయినందుకు తనలో తానే మెచ్చుకున్నాడు... ఎలాగయినా ఆమె చెప్పినట్లు నడుచుకోవాల్సిన బాధ్యత- ఆమెను సంతోషింప చెయ్యాల్సిన బాధ్యత తనయందు వుందిగా-! తానుచేసిన పనిలో తప్పేముందీ?

* * *

కల్కటాలో ఫిలిం పూర్తి కాక పోవుటచే మూణ్ణెల్లలో వొస్తానన్న సుందరం ఇంకా ఆర్నెల్లవరకు రావటానికి వీలులేదని వుత్తరం రాశాడు. కల్కటా వెళ్లిం తర్వాత మణినీ- రామారావునూ, బాబునీ సుందరం ఎలా మరిచిపోయాడో- అలాగే- వీరిద్దరూ; సుందరాన్ని మరిచిపోయారు. ఇప్పుడు ఆ వుత్తరంచూచి, ఆర్నెల్లకికాదు- ఇంకా ఆర్నెల్లకి వొస్తేమాత్రం బాధ ఏముందీ? అనుకున్నారు... అవును వారికి వీరెంతో వీరికి వారూ అంతేగా!... ఇదివరలో మణి గుమ్మం కదలటానికి వీల్లేదని- ఎంత శాసించినా ఎంత బ్రతిమాలినా వీల్లేకపోతే రెండుమూడు రోజుల కొకసారి అయినా; ఏదో సాకు చెప్పి 'బీచి'కి షికారు వెడుతూ వుండేవాడు. ఇప్పుడు మణి చెప్ప నవసరం లేదు. అసలు రామారావుకి మాత్రం... ఎలా వెళ్ల బుద్ధి పుడుతుంది?... అమ్మ ఒక్క క్షణం విడిచి పెట్టి వుండగలడా మణిని.

... ... ...

కేళీ విలాలలతో మున్గి తేలుతూ వున్న వారికి- అసలు తెల్లవారినదీ ప్రొద్దుకూకినదీ కూడా తెలియటంలా... వయసులో వున్న యువతీ యువకులు... తెలియవలసిన అగత్యంఏముందీ వారికి!...

రోజులు మామూలుగానే గడిచిపోతున్నాయి. కాని వారికి మాత్రం చాలా త్వరగా గడిచిపోతున్నాయిలా వున్నాయి. మణికి నాలుగో మాసం వొచ్చింది. అంతవరకు ఆ విషయమై ధ్యాసయే లేదు ఇద్దరికీని. కాని మణిలో మార్పు ఈషదీషత్తుగా గోచరిస్తోంది. సుందరం ఇహ ఇరవై రోజుల్లో వొస్తాడు. అప్పటికి అయిదో మాసం వస్తుంది. ఏమిటి కర్తవ్యం? సుందం రాగానే- ఎవరూ చెప్ప నవసరం లేకుండానే

ఈ విషయం గమనిస్తాడు... కొంత మంది తమ భార్యలు వ్యభిచరించినా సహిస్తారు- కాని ఆ పురుషుని వల్ల గర్భోత్పత్తి అయితే మాత్రం సహించరు...ఇహ సుందరం వొస్తే కొంప మునుగుతుందనే వుద్దేశ్యం రామారావుకి... చివరకు లేడీ డాక్టరు దగ్గరకు వెళ్ళి మందు ఏమయినా తీసుకువద్దామనుకున్నాడు.

ఏముందీ! నిజంగా మగవాళ్ళంత స్వార్ధపరులు మరొకరు వుండరు... రామారావుకి- తన పని తనకై పోయింది. సుందరం వొచ్చినా రాక పోయినా ఇహ తనతో పాటు కేళీ విలాసలకు మణి ఏడెనిమిది నెలలవరకు పనికిరాదు...ఎలాగైనా ఎల్లకాలమూ తనకు పనికి వొచ్చేదిలా వుండాలి మణి. అసలు పిల్లలు "మాతృ యౌవన వనచ్ఛేదీ కుఠార్యా"ట. ఇదివరకు ఒక పిల్లవాడు వున్నా..., ఇంకోడు పుట్టే సరికి ఇంకా తగ్గిపోవటంలా... ఇన్నాళ్లు సుఖం అనుభవించాం... మన ఆనందానికి చిహ్నంగా...సంతానం కలుగుతోందటే; విచారిస్తారు. అలాంటి అభిప్రాయాలు కలవారు మొదటే సుతానం కలగకుండాడా ఉపాయం చూసుకోవాలి కాని పుట్ట బోయే శిశువుని... ఏపాపమూ యెరుగని శిశువుని తమ కామానికి బలి ఇవ్వటమా?... ఇంత ఘోరమైన భ్రూణ హత్యా? ఒక వేళ ఆ మందువల్ల మణికే అపాయం జరిగితే! జరిగితే యేం సుందరానికి తెలిసి తనకు మాట రాకుండా వుండటమే తనకు కావాల్సినపని.

ఈ విషయంలో మణిని సలహా అడిగాడు. ఏమంటుందోనని. ఇలా భయపడి మణి రామారావు చెప్పిం దానికి అంగీకరించలా... ఇలాంటి విషయాల్లో ధైర్యం వహించి చాలా దూరం ఆలోచిస్తారు ఆడవాళ్ళు.

రామం! నువ్వు ఆనాటి కానాటికి మరీ పిరికి పందవై పోతున్నావేం?...ఇంత అధైర్య పడటా వెందుకూ? సుందరానికి జడిసి- మన చేతులారా నాశనం చేసుకుంటామా? ఆ మందువల్ల ఇప్పుడైతే నాకే అపాయం కలగవచ్చు కూడా...ఆ ప్రయత్నం మొదట్లోనే చెయ్యాలిసింది. నీకలాంటి అభిప్రాయం వున్నట్లయితే... ఇప్పుడు మించి పోయిన దాన్ని గురించి ఆలోచించటం యెందుకూ? ఆ ప్రయత్నం మానుకో— అని చెప్పింది. రామారావు తన స్వార్ధ పరత్వానికి తన ఆలోచనా విహీనత్వానికి-చాలా సిగ్గుపడ్డాడు.

*   *   *

సుందరం వస్తానని వుత్తరం రాశాడు. కాని అతనికి రావటం ఇష్టంలేదు. మళ్ళ-కళ్ల ముందర-వెధవ కూవమునది-అయ్యర్లూ-సాంబారూ-ప్రత్యక్షం...ఆ కల్‌కటా ముందర అతనికి మెడ్రాస్ ఓ పెద్ద పల్లెటూరిలా కనిపించింది-రాజును చూసిన కళ్ళకు మొగణ్ణిచూస్తే మొట్టబుద్ధి వేసిందన్నట్లు-

యథాప్రకారంగా సుందరం వొచ్చే రోజున-మణీ రామారావూ స్టేషనుకు వెళ్లారు. ఇంకా కొంత మంది స్నేహితులుకూడా వెళ్లారు. సుందరం బెంగాలీ బాబులావున్నాడు ఇప్పుడు. కొంతమంది అతన్ని గుర్తుపట్టలేక పోయారుకూడా...స్టేషన్ లోనే యథోచితంగా బాబును తీసుకుని మిత్రులతో మాట్లాడుతూ ఇంటికి చేరారు.

వచ్చిన వారం పదిరోజులదాకా అక్కడి ఫిలిం విషయాలూ; ఆ హుగ్లీనది-ఆ స్త్రీల సౌందర్య విశేషాలు—ఒకటేమిటి—కల్‌కటాను గురించి ప్రతి చిన్నవిషయం ఓ పెద్ద కథలా లా చెబుతూవుండే వాడు. స్నేహితులుకూడా ఎవళ్లో ఒకరు ఎప్పుడూ వెంటవుండే వాళ్లు... కొన్నాళ్ళు జరిగేసరికి ఈ స్నేహితుల హడావిడి కల్‌కటా కబుర్ల హడావిడి కొంతవరకు తగ్గింది... మళ్లా సంసారపు గొడవలోకి దిగింది.

*   *   *

మణి సంగతంతా చూచాయగా గ్రహించాడు సుందరం. మాటల్లో-

చర్యల్లో-అందాకా ఎందుకు ఇరుగు పొరుగువారి గుసగుసలే చాలు సంసారాలు చెడటానికి...రామారావులో-వెనకటికీ ఇప్పటికీ మార్పు చాలా వున్నట్లు వూహించాడు.

అనుమానం స్థిరమయింది మణిని. అడుగుదామా అనుకున్నాడు. కాని తాను కల్‌కటాలో ఏతీరుగా ప్రవర్తించాడు? అయితే మణికి తెలియదుగా ఆవిషయం! తెలిసినా తాను మగవాడుగా--ఎలా ప్రవర్తిస్తే మాత్రం ఏం?...ఏమిటో మగవాడికి ఆ ఉత్కృష్టత!...

తీరా అడిగితే--"మీరు ఎలా ప్రవర్తించారు కల్‌కటాలో? నే ప్రవర్తిస్తే-తప్పా?... కారణం?..." అని అడిగితే సమాధానం ఏం చెప్పాలి?...కాని అంత ధైర్యంగా అంత స్వేచ్ఛగా అడుగుతుందా? ఆడది!...అందులోనా అడుపాజల్లో వున్న మనిషి...ఆత్మలేని మనిషి ఆహాఁ ఎంతధీమా!...మగవాడికి!... ఆధీ మాతోనే కదిలించాడు ఓనాడు రాత్రి పదిగంటలకు...

దాపరికం ఎందుకూ?...నిజమే చెప్పేసింది...ఉగ్రుడైనాడు సుందరం ...రామారావుని ఖూనీచేస్తానంటూ బయలుదేరాడు...అయితే ఆ సమయంలో రామారావు ఇంట్లో లేక పోయాడు.

ఎంత తెలివి తేటలో సుందరానివి అతన్నేమో చేస్తాట్ట ఎలా తోచిందీ అసలతనికి ఆ వుద్దేశ్యం! అతన్నేమయినా చేస్తే తనకేం వచ్చిందీ?...అంత ఓర్వలేని తన మొందుకో మగవాడికి...

"చాలా ఘనకార్యం చేస్తారు? చాలా తెలివిగలపనే చేస్తారన్న మాట. అతని తప్పు ఏముందీ?...నా అవసరాలన్నీ తీర్చవలసిన బాధ్యత అతనియందు మీరువుంచి వెళ్లారు. అతని బాధ్యత అతను నెరవేర్చుకున్నాడు. అతన్నేమో చేస్తానంటారు ఎందుకూ?..." అంది మణి ధైర్యంగా...

నోరులేవలా ఆ సమాధానానికి సుందరానికి. ఇదే సమయంలోనే రారామారావు వొచ్చాడు-సినిమా చూసి-భోజనంచేసి వీణ వాయించుకోటానికి...

వెంటనే—ఆ సమయంలోనే రామారావుకూడా కనిపించటంవల్ల- ఇస్పేటాసంత అయింది సుందరం మొహం!

*   *   *

